ధర్పల్లి మండలం వాడీ వద్ద కొట్టుకుపోయిన తాత్కాలిక బ్రిడ్జి

పోతంగల్ మండలం కుమ్మరిగల్లిలో వర్షానికి పాక్షికంగా కూలిన ఇల్లు

జిల్లా కేంద్రంలో కంట్రోల్‌రూమ్‌లో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ హన్మంతు

అలుగు పారుతున్న రామడుగు ప్రాజెక్టు

గుండారం మల్కాపూర్(ఏ) పెద్ద చెరువువద్ద యువకులు

కోటగిరిలో పొంగిన గర్గువాగు

మంచిప్ప పెద్దచెరవు అలుగులో చిక్కిన 20కిలోల చేప

జిల్లాలో భారీ వర్షాలు

నిజామాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ నిజామాబాద్ జిల్లా యంత్రాంగం: జిల్లావ్యాప్తంగా శనివారం రాత్రి నుంచి వర్షం కురుస్తూనే ఉన్నది. దీంతో చెరువులు, కుంటల్లోకి పూర్తిస్థాయిలో నీరు చేరింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాలు జమయమయ్యాయి. పలు ఇండ్లు పాక్షికంగా కూలిపోయాయి. పంట పొలాల్లోకి నీరు వచ్చి చేరింది. వాగులు పొంగడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఉమ్మడి జిల్లాలో ఐదు చోట్ల కుండపోత వాన కురియగా 25 మండలాల్లో అతి భారీ వర్షపాతం రికార్డు కాగా మిగిలిన చోట్ల భారీ నుంచి సాధారణ వర్షపాతమే నమోదైంది. నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా సిరికొండ మండలం తూంపల్లిలో 11.6సెం.మీ వర్షాపాతం నమోదైంది. కామారెడ్డి జిల్లాలో గాంధారి మండలం సర్వాపూర్‌లో 14.4సెం.మీ, గాంధారిలో 12.9సెం.మీ, కామారెడ్డి కలెక్టరేట్‌లో 12.8సెం.మీ, లింగంపేటలో 11.7సెం.మీ చొప్పున రికార్డు స్థాయిలో అతి భారీ వానలు కురిశాయి. వాతావరణ శాఖ వెల్లడించిన వివరాల మేరకు అనేక చోట్ల అతి భారీ వానలే కురిశాయి. పలు చోట్ల రెడ్ అలర్ట్, కొన్ని చోట్ల ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది.

నిజామాబాద్ నగరంలోనూ పలు కాలనీల్లో జలమయమయ్యాయి. దుబ్బా ప్రాంతంలో రాకపోకలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కొత్త కలెక్టరేట్ సమీపంలో వరద నీరు భారీగా మురికి కాలువ గుండా ఉధృతంగా ప్రవహించింది. నగరం మధ్యలో నుంచి వెళ్లే పులాంగ్ వాగు భారీ ప్రవాహాన్ని అందుకుంది. గూపన్‌పల్లి గ్రామానికి వెళ్లే దారి మీదుగా పులాంగ్ వాగు ప్రమాదకర స్థాయిలో వరద పోటెత్తింది. రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది అప్రమత్తతతో వ్యవహరించారు. నీళ్లు నిలువకుండా ఎప్పటికప్పుడు జాగ్రత వహించారు. మొన్న ఆర్టీసీ బస్సు నీళ్లలో చిక్కుకున్న ఘటన నేపథ్యంలో చర్యలు తీసుకోవడం మూలంగా జనాలకు ఉపశమనం దక్కింది. చంద్రశేఖర్ కాలనీ, దుబ్బా, సుభాష్ నగర్, గాయత్రి నగర్, ఆర్యనగర్, న్యాల్‌కల్ రోడ్డులోని పలు కాలనీల్లో జనాలకు వరద నీరు ఇక్కట్లు తీసుకు వచ్చింది. వర్ని రోడ్డులోని ఖిల్లా, సాయినగర్ వంటి ప్రాంతాల్లోనూ అదే పరిస్థితి తలపించింది. ఏకధాటి వానతో నిజామాబాద్ నగరం చిగురుటాకులా వణికింది.

వేల్పూర్‌లో పెద్దవాగులపై నిర్మించిన చెక్‌డ్యాంపై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు

అలుగు పారుతున్న మంచిప్ప చెరువు

జిల్లా కేంద్రంలోని గౌతం నగర్‌లో రోడ్డుపై నిలిచిన నీరు

జిల్లా కేంద్రంలో రోడ్డుపై నిలిచిన నీరు

మాక్లూర్‌లో శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న డీసీపీ తరుణ్‌కుమార్

రెంజర్లలో స్థానికులతో మాట్లాడుతున్న అధికారులు

ఏర్గట్ల మండలం తడ్‌పాకల్ వద్ద గోదావరిలో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రాము

కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్ నుంచి తండాలకు వెళ్లే దారిలో కల్వర్టుపై ఏర్పడిన గుంతలు

బోధన్ మండలం చిన్నమావంది వద్ద ప్రవాహిస్తున్న వాగు

బోధన్ బెల్లాల్ చెరువు అలుగుల ద్వారా బయటకు వస్తున్న నీరు

పొంగిపొర్లుతున్న భీమ్‌గల్ చెక్‌డ్యాం

బాల్కొండ మండలం బోదేపల్లి రోడ్డు..

కందకుర్తి వద్ద గోదావరినదిలో మునిగిన శివాలయం

బెల్లాల్‌లో దివ్యాంగులైన తల్లీకూతుళ్లను జీపీ పునరావాస కేంద్రానికి తరలించిన తహసీల్దార్

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 1: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగులకు పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని ఎంప్లాయీస్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఎంప్లాయీస్ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా చైర్మన్ అలుక కిషన్ అధ్యక్షతన ఉద్యోగులు జిల్లా కేంద్రలో నల్ల బ్యాడ్జీలను ధరించి ఆదివారం నిరసన తెలిపారు. పాత పింఛన్ విధానం అమలు చేసే వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో అమృత్‌కుమార్, హన్మంత్‌రెడ్డి, ప్రశాంత్, మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ పులాంగ్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి బీసీటీయూ జిల్లా అధ్యక్షుడు మాడవేటి వినోద్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా ఉపాధ్యక్షులు శంకర్, విజయ్‌కుమార్, నాయకులు గంగోని సంజీవ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ'ఏ'లోకి మార్చాలి

ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 1: ముదిరాజ్ కులస్తులను బీసీ 'డీ' నుంచి 'ఏ' లోకి మార్చాలని ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసాని వీరేశ్ డిమాండ్ చేశారు. ముదిరాజ్ సంఘ సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు కరాటే రమేశ్‌కుమార్ ఆధ్వర్యంలో నగరంలోని అంబేద్కర్ భవన్‌లో ఆదివారం నిర్వహించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్ కులస్తులను గెలిపించుకోవాలని సూచించారు. ముదిరాజ్‌లు రాజకీయంగా ఎదగాలన్నారు. సమావేశంలో నాయకులు ప్రసాద్, రాజారాం, వినోద్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్‌రూం ను పరిశీలించిన కలెక్టర్

కంఠేశ్వర్, సెప్టెంబర్ 1: జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూంను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదివారం పరిశీలించారు. ఇప్పటివరకు ఎన్ని ఫిర్యాదులు వచ్చాయనే వివరాలను ఆపరేటర్ అహ్మద్ పాషాను అడిగి తెలుసుకున్నారు. వర్షాలతో ఇబ్బందులు ఉంటే 08462-220183 నంబర్‌కు సమాచారం అందించాలని తెలిపారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ అంకిత్, కిరణ్ కుమార్, ఏవో ప్రశాంత్ ఉన్నారు. జిల్లావ్యాప్తంగా ఆదివారం 13ఫిర్యాదులు వచ్చినట్లు సమాచారం.

వేదమిత్రను సన్మానించిన పోచారం

సుభాష్‌నగర్, సెప్టెంబర్ 1: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 300కు పైగా గీతా యజ్ఞాలను నిర్వహించిన ఆచార్య వేదమిత్రను బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి బాన్సువాడలోని ఆర్యసమాజ్‌లో సన్మానించినట్లు నిజామాబాద్ ఆర్యసమాజం అధ్యక్షుడు సూర్యప్రకాష్ ఆర్య పత్రిక ప్రకటనలో తెలిపారు.

రుణమాఫీ చేయాలని ఎమ్మెల్యేకు వినతి

ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న బినోలా సొసైటీ చైర్మన్, రైతులు

నవీపేట, సెప్టెంబర్ 1: రుణమాఫీ చేయాలని కోరుతూ పలువురు రైతులు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి ఆదివారం నిజామాబాద్ లోని ఆయన నివాసంలో బినోలా సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మాండ్లు ఆధ్వర్యంలో రైతులు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఇటీవల రుణమాఫీ చేసిన రైతుల జాబితాలో తమ పేర్లులేవని వివరించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే త్వరలో అర్హులందరికీ రుణమాఫీ అయ్యేలా చర్యలు తీసుకుంటానని అన్నారు. బినోలా సొసైటీ నుంచి మోకన్‌పల్లి సంఘాన్ని వేరు చేయాలని రైతులు కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నందిపేట్, సెప్టెంబర్ 1: ఖుద్వాన్‌పూర్‌కు చెందిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై హరిబాబు కథనం మేరకు.. గ్రామానికి చెందిన సుకృత్(22) యేడాది క్రితం అదే గ్రామానికి చెందిన రజితను ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. పోలీసులు శుక్రవారం ఇద్దరినీ స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించారు. భర్త వద్దకు వెళ్లేందుకు రజిత ఒప్పుకోలేదు. దీంతో మనస్థాపానికి గురైన సుకృత్ పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే గడ్డి మందు తాగాడు. చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు..

జక్రాన్‌పల్లి , సెప్టెంబర్ 1: రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు మండలంలోని పడకల్ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన చందన, నరేశ్‌లు ఎంపికైనట్లు పాఠశాల పీడీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఆగస్టు 28న ఆర్మూర్ బాలుర హైస్కూల్‌లో నిర్వహించిన సబ్‌జూనియర్ జిల్లాస్థాయి టెన్నికాయిట్ సెలక్షన్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన చందన, నరేశ్ ఈనెల 1 నుంచి 3 వరకు ఆర్మూర్ పట్టణంలోని బాలుర పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలలో పాల్గొంటారని పీడీ శ్రీనివాస్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం సురేందర్‌రెడ్డి, జిల్లా టెన్నికాయిట్ ప్రధాన కార్యదర్శి మల్లేష్‌గౌడ్, ఉపాధ్యాయులు, వీడీసీ సభ్యులు అభినందించారు.

విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలి

రుద్రూర్/ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్ 1: రుద్రూర్ వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజీలో శనివారం ఆత్మహత్య చేసుకున్న రక్షిత కుటుంబానికి న్యాయం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు నడిపింటి కార్తీక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్నిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బాధిత కుటుంబానికి రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. నాయకులు పాల్గొన్నారు. రుద్రూర్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని రక్షిత వసతి గృహంలోని బాత్‌రూంలో ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై విచారణ చేపట్టాలని పీడీఎస్‌యూ ఆర్మూర్ డివిజన్ అధ్యక్షుడు ప్రిన్స్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

సంక్షిప్తంగా..

■ **మూడు రోజులు మిషన్ భగీరథ నీరు బంద్** - కోటగిరి, సెప్టెంబర్ 1: మండలంలో ఆది, సోమ, మంగళవారాల్లో మిషన్ భగీరథ నీళ్లు సరఫరా కావని ఏఈ ధన్‌రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెద్దిరెడ్డి పేట్ వద్ద ఉన్న ఫిల్టర్ బెడ్‌లో మరమ్మతులు చేపడుతున్నారని, దీంతో నీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు.

■ **ఆల్‌ఇండియా జోనల్ హాకీ పోటీలకు ఎంపిక**- సిరికొండ, సెప్టెంబర్ 1: ఆల్ ఇండియా జోనల్ హాకీ టోర్నమెంట్‌కు తూంపల్లి క్రీడాకారులు అగ్గి మనోజ్, కంచెర్ల అక్షయ ఎంపికైనట్లు పీఈటీ నాగేశ్ ఆదివారం తెలిపారు. జార్ఖండ్ రాష్ట్రంలో ఈనెల1 నుంచి 3 వరకు నిర్వహించే ఆలిండియా జూనియర్ మెన్, ఉమెన్ జోనల్ టోర్నీలో పాల్గొంటారని పేర్కొన్నారు.

■ **ఆర్థిక సాయం** - భీమ్‌గల్, సెప్టెంబర్ 1: పట్టణానికి చెందిన జుబేదా రెండేండ్లగా క్యాన్సర్‌తో బాధపడుతున్నది. పేద కుటుంబం కావడంతో ఎన్ఎస్‌యుఐ జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ రహమాన్, భోజరాజు పుప్పాల విశాల్, సుంకరి సురేశ్ రూ.5,500 జుబేదాకు అందించారు.

■ **ఘనంగా ఎడ్ల పొలాల అమావాస్య**- నవీపేట, సెప్టెంబర్1: మండలంలోని నాళేశ్వర్ గ్రామంలో ఆదివారం ఎడ్ల పొలాల అమావాస్యను రైతులు ఘనంగా నిర్వహించారు. బసవన్నలను అందంగా అలంకరించి ముస్తాబు చేసి ఆంజనేయ స్వామి ఆలయం చుట్టూ ప్రదక్షణ చేయించారు.

■ **రిటైర్డ్ ఎంఈవోకు సన్మానం**- ఎడపల్లి, సెప్టెంబర్ 1: ఉద్యోగ విరమణ చేసిన ఎంఈవో రామారావును ఉపాధ్యాయులు, బంధుమిత్రులు మండల కేంద్రంలోని ఆదివారం సన్మానించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రవి కిరణ్, గౌరవ అధ్యక్షుడు ఇల్తపు శంకర్ పాల్గొన్నారు.

■ **విరాళం అందజేత**- నందిపేట్, సెప్టెంబర్ 1: మండల కేంద్రంలోని నాగమంతెన మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో శ్రీశక్తి రూపిని దుర్గా దేవి మండపం నిర్మాణం కోసం రూ.6 లక్షలు విరాళాన్ని అందజేసినట్లు మున్నూరుకాపు సంఘ సభ్యులు ఆదివారం తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, PESSU TIRUPATHI REDDY R/o. H.No.4-10, Subiryal, Armoor, Nizamabad. Telangana now I have changed name/ Surname as PEESU THIRUPATHI REDDY

NTZ-340360

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల క్లాసిఫైడ్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సంక్షిప్తంగా..

■ **చెరువుల పరిశీలన** - ఎడపల్లి, సెప్టెంబర్1: రైల్వే లైన్‌ను ప్రభావితం చేసే చెరువులను ఇరిగేషన్ ఏఈఈ రాజ్యలక్ష్మి, తహసీల్దార్, ఎస్సై వంశీకృష్ణారెడ్డి ఆదివారం పరిశీలించారు. ఇరిగేషన్ ఏఈఈ మాట్లాడుతూ పెద్ద చెరువు, బతుకమ్మ చెరువు, అడి చెరువుల్లోని నీరు రైల్వే ట్రాక్ వరకు చేరిందా లేదా అని పరిశీలించామని అన్నారు. ప్రస్తుతం నీరు చేరలేదని అన్నారు.

■ **వర్షంలోనూ విద్యుత్ పనులు**- మోర్తాడ్, సెప్టెంబర్1: మోర్తాడ్ విద్యుత్ సిబ్బంది ఆదివారం విద్యుత్ పోయిన ప్పుడల్లా వర్షంలోనే పనులు చేయడంపై ప్రజలు వారికి అభినందించారు. ఆదివారం చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ వైర్లపై పడి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో విద్యుత్ సిబ్బంది వానలోనే విద్యుత్ స్తంభాలు ఎక్కి విద్యుత్ వైర్లు సరిచేసి సరఫరాను పునరుద్ధరించారు.

■ **వీడీసీ మాజీ చైర్మన్‌కు సన్మానం**– రెంజల్, సెప్టెంబర్ 1: దూపల్లి వీడీసీ చైర్మన్‌గా ఐదేండ్లు సేవలందించిన లింగన్నను నూతన కమిటీ సభ్యులు ఆదివారం సన్మానించారు. నూతన అధ్యక్షుడు సీహెచ్.బాబన్న, ఉపాధ్యక్షుడు శేశుగారి గోపాల్‌రెడ్డి, కోశాధికారి నాగరాజు, సభ్యులు పాల్గొన్నారు.

■ **ఎన్నిక**- మోర్తాడ్, సెప్టెంబర్ 1: కమ్మర్‌పల్లి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా కమ్మర్‌పల్లికి చెందిన దంతుల రమణయ్య ఎన్నికయ్యారు. ఆదివారం నిర్వహించిన ఆర్యవైశ్యసంఘం మండల స్థాయి సమావేశంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా బెజగం వెంకటేశ్, కార్యదర్శిగా జొన్నల భూషణ్, కోశాధికారిగా భాస్కర్, సలహాదారులుగా చిటికేసి గంగాధర్, మరియాల నాగభూషణం, ఆమేడ నరేందర్‌ను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన రమణయ్యను సభ్యులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

■ **క్రీడా పోటీలు వాయిదా** బాల్కొండ, సెప్టెంబర్ 1: వర్షాల కారణంగా ఉమ్మడి బాల్కొండ మండల అంతర పాఠశాలల క్రీడా పోటీలను వాయిదా వేసినట్లు ఎంఈఓ రాజేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తేదీలను తర్వాత వెల్లడిస్తామని పేర్కొన్నారు.

■ **ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి** - శక్కర్‌నగర్, సెప్టెంబర్ 1: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం బోధన్ మున్సిపాలిటీ పరిధిలోని నర్సాపూర్ లోనూ వర్షంలోనే అవగాహన సదస్సు నిర్వహించారు.

■ **అక్రమరవాణాపై చర్యలు తీసుకోవాలి**- మోర్తాడ్, సెప్టెంబర్1: స్థానిక పోలీస్‌స్టేషన్‌కు కూత వేటు దూరంలో అడ్డాను ఏర్పరుచుకుని రేషన్ బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తుంటే అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం ఆశ్చర్యకరమని బీజేపీ మండల అధ్యక్షుడు పుప్పాల నరేశ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కమీషన్ల కోసం కాంగ్రెస్ నాయకులు కక్కుర్తి పడి రేషన్ బియ్యం రవాణా చేస్తున్న మాఫీయాకు సహకరిస్తున్నారని ఆరోపించారు.

వేల్పూర్ మండలంలోని పడిగెల్ జడ్పీహెచ్ఎస్ 2011-12 టెన్త్‌బ్యాచ్ విద్యార్థులు వేల్పూర్ క్రాస్ రోడ్డులోని అనిల్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సమావేశమయ్యారు. ఆనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకుని కుటుంబ సభ్యులతో కలిసి ఉల్లాసంగా గడిపారు. ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్‌రావు, అశోక్, గంగాధర్, లింబాద్రి, లక్ష్మీనారాయణ, గంగామోహన్, గంగానర్సయ్య, రాజేందర్ గౌడ్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. – వేల్పూర్, సెప్టెంబర్1

అధికారులు సహాయక చర్యలు చేపట్టాలి

కోటగిరి, సెప్టెంబర్ 1: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు సహాయక చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి దుబాస్ రాములు అన్నారు. కోటగిరిలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్యారోగ్య సిబ్బంది అందుబాటులో ఉంటూ సేవలను అందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రేషన్ కార్డుల ఈకేవైసీ గడువును పెంచాలని కోరారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి విఠల్‌గౌడ్, నాయకులు నల్ల గంగాధర్ పాల్గొన్నారు.